సాక్షి తిరుపతి

సోమవారం ၊ 13 ၊ అక్టోబర్ ၊ 2025



దామినేడులో కార్డెన్ సెర్చ్

తిరుచానూరు సమీపంలోని దామినేడు వద్ద ఇందిరమ్మ గృహ సముదాయంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. - 8లో



కల్వర్టు కింద ఖరీదైన మాత్రలు

తిరుపతి రూరల్ మండలంలో ఓ కల్వర్టు కింద పడి ఉన్న ఖరీదైన మాత్రలను కొందరు విలేకర్లు గుర్తించారు. - 8లో



25న జీశాట్-7ఆర్ ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 25వ తేదీన జీశాట్ -7ఆర్ ఉపగ్రహం ప్రయోగించనుంది - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ ఝాన్సీలక్ష్మి

తిరుపతి సిటీ : శ్రీచైతన్య విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అధ్యాపకులు, టెక్నో స్కూల్ టీచర్లు, బోధనేతర సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆదివారం ఈ మేరకు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చే వారికి క్రమశిక్షణ అవసరమని వెల్లడించారు. శ్రీచైతన్య చిన్న సంస్థగా మొదలైందని, నేడు ఆసియాలోని అతిపెద్ద విద్యాసంస్థగా ఎదిగిందని వివరించారు. నేను అనే భావనతో కాకుండా, మేము అని పనిచేస్తే ప్రగతి పథంలో పయనించవచ్చని తెలిపారు. శ్రీచైతన్యలోని ప్రతి విద్యార్థి కలను సాకారం చేసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య కాలేజీల ఏజీఎం బీవీ ప్రసాద్, పాఠశాలల ఏజీఎం సురేష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 84,571 మంది స్వామివారిని దర్శించుకోగా 36, 711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.70 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటి నుంచి రెండో విడత అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ విద్యాసంస్థలలో రెండో విడత అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఓఏమ్‌డీసీ నుంచి విద్యార్థుల మొబల్ ఫోన్లకు సమాచారం అందించారు. రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు రెండు రోజులోపు ఆయా కళాశాలలో తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. అనంతరం మరో రెండు రోజుల తర్వాత ఆయా కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు.

రాజకీయాల్లో కొందరు నేతలు నైతిక విలువలను వదిలేస్తున్నారు. పదవుల కోసం ఎత్తులు వదిలేసి జిత్తులకు దిగుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోసం యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చివరకు ప్రాణాలు తీసేందుకు సైతం దిగజారుతున్నారు. ఇదే కోవలో జనసేన మాజీ నేత కోట వినూతపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలు కుట్రలకు తెగబడినట్లు సోషల్ మీడియాలోకి వచ్చిన ఓ వీడియో వైరల్‌గా మారింది. వినూత డ్రైవర్‌గా పనిచేసి హత్యకు గురైన రాయుడు తీసుకున్నట్టుగా చెబుతున్న సెల్ఫీ వీడియో జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. కోట దంపతులను టార్గెట్ చేసుకుని బొజ్జల తనకు డబ్బులు ఎరవేసినట్లు డ్రైవర్ స్పష్టంగా వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. అయితే నేతల నడుమ పోరులో చివరకు సదరు దళితుడు బలి కావడం విషాదంగా మిగిలింది.



అవునా బొజ్జలా?

కలకలం రేపిన రాయుడి సెల్ఫీ వీడియో

- చర్చనీయాంశంగా మారిన సుధీర్‌రెడ్డి వ్యవహారం
- కోట వినూతపై కుట్రలకు పాల్పడినట్లు ఆరోపణలు
- డబ్బులు ఎరవేశారని వీడియోలో వెల్లడించిన డ్రైవర్ రాయుడు
- విషయం బయటపడడంతోనే హత్యకు గురైన దళితుడు



వినుత



వీడియోలో శ్రీనివాస్ అలియాస్ రాయుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కోట వినూత వద్ద డ్రైవర్‌గా పనిచేసిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు మాట్లాడినట్టుగా వచ్చిన ఓ సెల్ఫీ వీడియోలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై పలు ఆరోపణలు వినిపించాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం కుట్ర పన్నినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే వినూత రహస్య సమాచారం , కొన్ని వీడియోలు సేకరించి అధిష్టానానికి చేరవేసి సుధీర్‌రెడ్డి టికెట్ సాధించినట్లు శ్రీకాళహస్తి వాసులు చర్చించుకుంటున్నారు. బొజ్జల సుధీర్ రెడ్డి కారణంగా కూటమిలోని అనేక మంది నేతలు రాజకీయంగా అణచివేతకు గురవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఎన్నికల ముందు కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీలోని ముఖ్య నేతలు టికెట్లు దక్కించుకునేందుకు ఒకరిని ఒకరు వెన్నుపోట్లు పొడుచుకున్న విషయం తెలిసిందే. ప్రధానంగా శ్రీకాళహస్తి టికెట్ కోసం ఏకంగా హత్యా రాజకీయాలకు తెరతీశారనే ప్రచారం కోట వినూత డ్రైవర్ రాయుడు వీడియో ద్వారా గుప్పుమంది. శ్రీకాళహస్తి అసెంబ్లీ టికెట్ కోసం కూటమి పార్టీలోని బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య కుమారుడు, బీజేపీ నేత కోలా ఆనంద్, జనసేన నేత కోట వినూత పోటీ పడిన విషయం విదితమే. టికెట్ దక్కించుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలే చేశారు. ఈక్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేయడంతో పాటు.. ఆయా పార్టీల అధిష్టానాలకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఒకానొక సందర్భంలో మీడియా ముఖంగా వీధికెక్కారు.

నాడు టీడీపీ, జనసేన నేతల మధ్యే పోటీ

సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీల సీట్ల కేటాయింపుకు సంబంధించి శ్రీకాళహస్తి టికెట్ టీడీపీ లేదా జనసేనలో ఒకరికి ఇస్తారని ముందుగానే తేలిపోయింది. దీంతో కోట వినూతను లక్ష్యంగా చేసుకుని ఆమె డ్రైవర్‌ని కోవర్టుగా బొజ్జల సుధీర్‌రెడ్డి ఎంపిక చేసుకున్నట్లు రాయుడి వీడియో ద్వారా బయటపడింది. ఒకరి విషయాలు ఒకరు తెలుసుకునేందుకు కూటమి నేతలు కోవర్టులను నియమించుకున్నారు. అందులో భాగంగా కోట వినూత విషయంలో బొజ్జల చాలా దూరంగా ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అందుకే డ్రైవర్ రాయుడుకి రూ.60 లక్షలు ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు వీడియో ద్వారా వెలుగు చూసింది. అలాగే అనేక మందిని పావుగా వాడుకున్నట్లు వీడియో ద్వారా వెల్లడైంది. చివరకు కోట వినూత దంపతులను యాక్సిడెంట్ ద్వారా హత్య చేసేందుకు సైతం రెండు పర్యాయాలు యత్నించినట్లు రాయుడు వీడియో ద్వారా బయటపెట్టాడు. రాజకీయ పోరులో దళితుడైన సీహెచ్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యకు గురవడం అప్పట్లో సంచలనంగా మారింది. రాయుడు హత్యకు దారి తీసిన కారణాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఆరోపణలు నిజమేనా?

డ్రైవర్ రాయడు హత్య తర్వాత అరెస్ట్ అయిన కోట వినూత దంపతులు మీడియా సాక్షిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేరును ప్రస్తావించారు. రాయుడి హత్య వెను ఎవరి పాత్ర ఉందని మీడియా ప్రశ్నించిన సమయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరును వెల్లడించడం నాడు కలకలం రేపింది. అన్ని విషయాలను త్వరలోనే బయటపెడతామని చెప్పినట్టే.. నేడు రాయుడి వీడియో వైరల్ కావటం పెద్ద దుమారమే రేపుతోంది. శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి అధ్యక్ష పదవిని కొట్టే సాయికి కట్టబెట్టడం వెనుక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హస్తం ఉందని కోట వినూత లేఖ ద్వారా ఆరోపించింది. బొజ్జల సుధీర్‌రెడ్డికి టికెట్ కేటాయించడం వెనుక జనసేనలోని మరో నాయకుడు కొట్టేసాయి ఉన్నారని రాయుడు వీడియో ద్వారా తెలుస్తోంది. అదే విధంగా శ్రీకాళహస్తిలో పలువురు ప్రధాన భూమిక పోషించారని డ్రైవర్ వీడియో ద్వారా వెల్లడవుతోంది. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఇంకెన్ని వీడియోలు, వాయిస్ రికార్డులు బయటకు వస్తాయోనని కూటమి నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

వరసిద్ధుని సేవలో జూనియర్ ఎన్టీఆర్ సతీమణి



స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న ప్రణతి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి దర్శించుకున్నారు. ఆమెతో పాటు సినీ నటుడు నార్నె నితిన్, వారి కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దగ్గరుండి స్వామి దర్శనం కల్పించారు.

ఒకే ఊరిలో 8మంది డీఎస్సీకి ఎంపిక



ఉద్యోగాలను సాధించిన వారిని సత్కరిస్తున్న రామచంద్రయ్య, మణియాదవ్

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లెలో 2025 డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 8మందిని రిటైర్డ్ హెచ్ఎం అరిగిల రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎంపికైన వారిలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బి.లిషా నందిని, స్కూల్ అసిస్టెంట్‌గా దళవాయి సూర్య లోకనాధం, పీఈటీగా బొజ్జా సుమలత, ఎస్‌జీటీలుగా కె.దిలీప్ కుమార్, దళవాయి సురేంద్ర, ఆవుల కళ్యాణి, అరిగెల భానుప్రకాష్, డి.మహేష్ ఉన్నారు. ఒకే గ్రామంలో 8 మంది డీఎస్సీలో ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని పలువురు వారిని అభినందించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులందరూ ఇదే స్ఫూర్తితో మరెందరో విద్యార్థుల భవితకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవుల క్రిష్ణయ్య(గార్డు), గేనే సుబ్బయ్య, జూ పార్క్ మాజీ డైరెక్టర్ మణి యాదవ్, అరిగిల కృష్ణ, భీమరాజు, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై నిరసనలు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్‌సీపీ నేతలు

పుంగనూరు : కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం మాఫియా, వేల కోట్ల రూపాయలను చట్ట వ్యతిరేకంగా దోచుకోవడంపై సోమవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఆదివారం తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గ నాయకులు , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, వల్లివేడు పృథ్వీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కల్తీ మద్యం వ్యాపారంతో వేల కోట్లు దోచుకుంటున్న తెలుగుదేశం నాయకుల వ్యాపారాల గురించి ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేయాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పుంగనూరు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు గౌస్, అఖిల్, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలా తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు సోమవారం వినతిపత్రం ఇవ్వనున్నట్లు వైఎస్ఆర్ సీపీ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ మండల ఎంపీటీసీలు, సర్పంచులు, నేతలు, మహిళలు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వోద్యోగులపై నిర్లక్ష్యం తగదు

పాకాల: ప్రభుత్వోద్యోగులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని బీటీఏ నాయకులు విమర్శించారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వహిస్తోందని సమస్యలపై గళం విప్పారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పి.రాజేంద్రుడు, గోపాలయ్య, ఆదికేశవులు, కృష్ణమూర్తి, జయబాల, కేఎస్.తులసీరామన్, రెడ్డెప్ప, జోతీశ్వర్, శివ, గిరి, గోపి, వెంకటయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ మన హక్కు



మాట్లాడుతున్న కుప్పాల గిరిధర్ కుమార్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుకోవడం మనందరి హక్కు దీని కోసం ఉద్యమిద్దాం అంటూ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాలాజీ రైల్వే డివిజన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ 1990లో వచ్చిందన్నారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చక పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతాయ అసమానతలు తలెత్తకుండా రాయలసీమకు న్యాయం చేయాలని కోరారు. 35 ఏళ్ల కలను సాకారం చేసుకునే దిశగా పోరాటం సాగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు మాట్లాడుతూ రైల్వే డివిజన్ ఏర్పాటు చేస్తే జిల్లా అభివృద్ధికి ఉపయోగపడుతుందని చెప్పారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రయాణికులకు రైల్వే డివిజన్ ఏర్పాటుతో వసతులు కల్పించవచ్చని తెలిపారు. ముబ్బు దేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైల్వే అనుసంధాన వ్యవస్థ, వాణిజ్యం, ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు డివిజన్ దోహదం చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ కోసం ప్రజల్లో బలమైన ఆకాంక్ష ఉందని వెల్లడించారు. నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏడాదికి రూ.250 కోట్ల ఆదాయాన్ని సమకూర్చే తిరుపతికి రైల్వే డివిజన్ పొందే అర్హతలు ఉన్నాయని వివరించారు. రాజకీయ ఒత్తిడితోనే బాలాజీ డివిజన్ ఆశలను తుంగలో తొక్కి గుంటూరు డివిజన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సుకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. టీటీడీ మాజీ డిప్యూటీ ఈఓ చిన్నంగారి రమణ, పీసీ రాయల్, బీఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆకుల సతీష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి, న్యాయవాది దినకర్, నేతలు మహీధర రెడ్డి, శ్రీధర్ బాబు, వేణుగోపాల్ రెడ్డి, కుప్పాల నీలిష్ పాల్గొన్నారు.

300 ఎకరాలు హాంఫట్!



చెన్నై వాసులు కబ్జా చేసిన అటవీ భూమి

కంచే చేను మేసినట్టు సత్యవేడు మండలంలోని రెవెన్యూ అధికారులు వ్యవహరించారు. కాసులకు కక్కుర్తి పడి సుమారు 300 ఎకరాల అటవీ భూములను కబ్జాకోరులకు అప్పనంగా అప్పగించేశారు. తమిళనాడుకు చెందిన ఆరుగురి పేరిట వెబ్‌ల్యాండ్‌లోకి సైతం ఎక్కించేశారు. ఇందుకోసం కొత్తగా సర్వే నంబర్లను సృష్టించేశారు. ఇష్టారాజ్యంగా సబ్ డివిజన్లు నమోదు చేసి అక్రమార్కులకు హక్కులు కల్పించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పెద్ద మొత్తంలో నగదు చేతులుమారినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా భూములను రీసర్వే చేస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయని స్పష్టం చేస్తున్నారు.

- కొత్తగా సర్వే నంబర్లు సృష్టించి స్వాహా
- యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణ
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- చెన్నై వాసుల పేరుతో ఆన్‌లైన్‌లో సైతం నమోదు

సత్యవేడు : సత్యవేడు మండలంలోని వానెల్లూరు గ్రామంలో సుమారు 3 వందల ఎకరాల అటవీ భూమిని తమిళనాడు చెందిన ఆరుగురు వ్యక్తులకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టేశారు. వెబ్‌ల్యాండ్‌లో సైతం అక్రమార్కుల పేర్లను నమోదు చేయడంపై పోలీసులకు తహసీల్దార్ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. వివరాలు.. గ్రామ సమీపంలోని 300 ఎకరాలు 2024 వరకు అటవీ భూమిగానే రెవెన్యూ రికార్డుల్లో ఉండేది. ఇందులో ఫారెస్ట్ అధికారులు జీడిమామిడి, నీలగిరి చెట్ల పెంపకం సైతం చేపట్టారు.

నూతనంగా సబ్ డివిజన్లు

వానెల్లూరులోని సర్వే నెంబరు 197/1లో 252 ఎకరాలు , 200/1లో 49-88 ఎకరాలు అటవీ భూమిగా ఉంది. దీనిపై చెన్నై వాసులు కొందరు కన్నేశారు. 2024 జూన్‌లో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారు. సర్వే నెంబరు 197/1లో శ్రీధరన్ పేరుతో 50.34 ఎకరాలు, 197/బీలో అమృతవర్షిణి పేరుతో 50.34 ఎకరాలు, 197/1సీలో నవీన్ రాజ్‌కన్న పేరుతో 50.34 ఎకరాలు, 197/డీలో అనూరాధ జైకుమార్ పేరుతో 50.34 ఎకరాలు, 197/ఈలో అతా జైకుమార్ పేరుతో 50.34 ఎకరాలు, 197/1ఎఫ్‌లో ఆశసురేష్ పేరుతో 34 సెంట్లను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లోకి ఎక్కించేశారు. ఈ మేరకు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేశారు. ఇందుకోసం 197/1 సర్వే నంబరును తమిళనాడు వాసుల కోసం సబ్ డివిజన్‌లుగా మార్చేశారు. ఈ మేరకు అప్పట్లో తహసీల్దార్‌గా పనిచేసిన రామాంజులునాయుడు చక్రం తిప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులతో చేతులు కలిపి భూ ఆక్రమణకు సహకరించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు

వానెల్లూరు అటవీ భూమిని నాలుగు సబ్ డివిజన్లు విభజించి తమిళనాడుకు చెందిన ఆరుగురి పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. వివాదాస్పద భూములపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. ఈ మేరకు సత్యవేడు సీఐ మురళీనాయుడు కేసు నమోదు చేశారు. మొత్తం 16 మందిని నిందితులుగా పేర్కొన్నారు.

రీసర్వే చేయాలి

వానెల్లూరు సమీపంలోని ఈ భూమి అటవీశాఖ పరిధిలోనే ఉందని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. చెన్నై వాసులు కట్టుకథలు అల్లుతున్నారని, విలువైన భూములను కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయా భూములను రీసర్వే చేస్తే నిజాలు బయటపడతాయని వెల్లడిస్తున్నారు.

ఆ భూములు మావే..

అటవీ భూముల విషయమై ఆక్రమణదారులకు సంబంధించి వారు వివరణ ఇచ్చారు. సర్వే నెంబరు 197/1లోని 300 ఎకరాల భూమిని ముత్తు కుమారస్వామి అయ్యర్ అనే వ్యక్తి చాలా ఏళ్ల క్రితం టీటీడీ నుంచి పొందారని చెప్పారు. అయన వారసుల నుంచి తాము కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అయితే ఫారెస్టు రేంజర్ త్రినాథ్‌రెడ్డి దీనిపై స్పందిస్తూ.. అటవీ శాఖ చట్టం ప్రకారం 1972లో ఈ భూమి రక్షిత అటవీ భూమిగా గెజిట్ అయినట్లు వివరించారు. ఇటీవల రెవెన్యూ, అటవీశాఖ చేపట్టిన జాయింట్ సర్వేలో సైతం ఇది ఫారెస్ట్ ల్యాండ్‌గానే నమోదైనట్లు తెలిపారు.



ఆక్రమిత భూమిలో నీలగిరి చెట్లు

CHRISTIAN MEDICAL COLLEGE
Ida Scudder Road, Vellore-4, TN.

SITUATION VACANT

Post	: Deputy Security Officer
Department	: Security Services - G.S.Office (Chittoor Campus)
Qualifications	: Any Graduate + 10 Years of relevant experience
Age limit	: 60 years and below
Consolidated Salary	: As per Institutional Norms.
Experience	: Previous experience in Armed Forces / Police service in Senior position.

Please log on to https://clin.cmcvellore.ac.in/cmcapp/listapplication.aspx
Link – "Vacancies". Icon – "Deputy Security Officer"
Hard Copies and emails will not be accepted. Apply on or before 22.10.2025.
Note: Applications should be made online. Applications through other job portals will not be considered.
General Superintendent, CMC Vellore

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని కార్మికుడు మృతి


మృతి చెందిన అపాచి కార్మికుడు

సూళ్లూరుపేట: మండలంలోని బైపాస్ రోడ్డు ఎన్‌హెచ్–16 దంపింగ్‌యార్డు వద్ద శనివారం రాత్రి టిప్పర్ ఢీకొని అపాచి కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వరదయ్యపాళెం రాచర్ల గ్రామానికి చెందిన కంరారపు ప్రసన్నకుమార్ (36) పాచిలో పని చేస్తూ తడ మండలం కాదలూరులో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి సూళ్లూరుపేటకు వచ్చి పనులన్నింటినీ చూసుకుని తిరిగి కాదలూరుకు మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా హఠాత్తుగా టిప్పర్ దూసుకొచ్చి ఢీ కొంది. అతన్ని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు వారికి సమాచారం అందించి కేసు నమోదు చేశారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీగంధం చెట్లు నరికివేత: వ్యక్తి అరెస్టు



దుంగతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

తిరుమల : శేషాచలం అటవీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లు నరికివేసిన వ్యక్తిని అటవీశాఖ బేస్ క్యాంప్ సిబ్బంది దాడిచేసి పట్టుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమల–పాపవినాశనం రోడ్డులోని జపాలీ తీర్థానికి సమీపంలో ఓ వ్యక్తి శ్రీగంధం చెట్టును నరికివేసి అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో అటవీశాఖ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు శ్రీగంధం చెట్టు వేరు భాగాలు రంపాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని తిరుపతికి తరలించి అటవీశాఖ అధికారులు విచారిస్తున్నారు.

అక్రమ వెంచర్‌కు నోటీసు


అనధికార లేఅవుట్

తొట్టంబేడు: తొట్టంబేడు రెవెన్యూ పరిధిలోని బీడీ కాలనీ వద్ద సర్వే నంబర్ 269/4లో వేసిన అక్రమ వెంచర్‌ను వెంటనే తొలగించాలని పంచాయతీ సెక్రటరీ భార్గవ్ ఆదివారం నోటీసు జారీ చేశారు. సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో సుచిత్ర గార్డెన్ పేరుతో వేసిన లేఅవుట్‌కు అనుమతులు లేవని నోటీసులో పేర్కొన్నారు. ఇప్పుడు ఆ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి సందిగ్ధంలో పడింది.


పంచాయతీ సెక్రటరీ జారీ చేసిన నోటీసు

కల్వర్టు కింద ఖరీదైన మాత్రలు



మాత్రల స్ట్రిప్


వకుళమాత గుడి సమీపంలోని కల్వర్టు కింద మాత్రల డబ్బా

తిరుపతి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో ఉండాల్సిన మాత్రలు కల్వర్టు కింద కనిపించాయి. ఖరీదైన ఈ మాత్రలను సర్కారు సైతం అంతంత మాత్రంగానే సరఫరా చేస్తుంది. అయితే ఫిజీషియన్ శాంపుల్స్ కింద సంబంధిత మందుల కంపెనీ వారు ఉచితంగా వైద్యులకు పంపుతుంటారు. వీటిని అవసరమైన రోగులకు వైద్యుల సూచనల మేరకు వాడాల్సి ఉంటుంది. వాటిని వేసుకున్న వారు కాసేపటికే మత్తులోకి వెళ్లక తప్పదు. ఒకటి, రెండు మాత్రలు తీసుకుంటే చాలు శరీరంలోని అలెర్జీ మొత్తం ఇట్టే తగ్గిపోతుంది. 'మత్తు'ను కలిగించే ఆ మాత్రలు గుట్టలు, గుట్టలుగా ఓ కల్వర్టు కింద బయట పడడంతో స్థానికులు నివ్వెరపోయారు.

పరిశీలనకు వెళితే..

తిరుపతి రూరల్ మండలం పేరూరు చెరువు నుంచి పాతకాల్వ కుంటలోనికి నీరు చేరే కాలువ (కల్వర్టు కింద)లో ఖరీదైన మందుల డబ్బాలు బయటపడ్డాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు వద్ద మట్టి తవ్వకాలు లోతుగా చేయడం, చెరువు స్థలాన్ని కప్పేయడంతో స్థానికంగా నివాసముంటున్న ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి ఆ మట్టి పనులను పరిశీలించేందుకు అక్కడకు వెళ్లారు. ఆయన వెంట వెళ్లిన మీడియా ప్రతినిధులకు అక్కడి కల్వర్టు కింద అలెర్జీకి ఉపయోగించే మాన్‌టెక్–ఎల్‌సీ అనే మాత్రల డబ్బాలు కనిపించాయి. మొదట ఎక్స్‌పైర్ అయిన మందులు అక్కడ పడేశారని తేలిగ్గా తీసుకున్నారు. ఒక సారి చూద్దామని పరిశీలిస్తే తయారీ తేదీ 09/2024, ఎక్స్‌పైర్ తేదీ 02/2027గా నమోదై ఉంది. అవి ఒక్కో స్ట్రిప్ రూ.330లుగా బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అంత ఖరీదైన మాత్రలను కల్వర్టు కింద ఎందుకు పడేశారని ఆరా తీయగా, ఎవరైనా మత్తుకు బానిసలుగా మారి వారు అక్కడ దాచిపెట్టారనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి. అయితే ఆ మాత్రల డబ్బాలపై ఫిజీషియన్ శాంపిల్స్.. నాట్ ఫర్ సేల్ అని రాసి ఉండడం గమనార్హం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కల్వర్టులు కింద కొందరు యువకులు చేరుతున్నారని, పోలీసులు దీనిపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం ఎగ్గొట్టి.. పొలం గట్లు తెగ్గొట్టి!


పొలంగట్లను తొలగించిన దృశ్యం

- ఏపీఐఐసీ అధికారుల అత్యుత్సాహం
- నష్టపరిహారం అడిగినందుకు రైతులపై కక్ష సాధింపు
- ఆందోళనలో బాధితులు

వరదయ్యపాళెం : దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ఏపీఐఐసీ అధికారులు వేధిస్తున్నారు. భూసేకరణ కింద తీసుకున్న భూములకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. పొలాలు సాగుకు పనికి రాకుండా గట్లు తెగ్గొట్టేశారు. వివరాలు.. వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు రెవెన్యూలోని సర్వే నెంబర్ 83/2లో 1.48 ఎకరాలు డి.శకుంతలమ్మ పేరిట, 83/3లో 1.73 ఎకరాలు డి. రత్నం పేరిట 45ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం డీకేటీ పట్టాలను అందజేసింది. అప్పటి నుంచి ఆ భూముల్లో వారు వ్యవసాయం చేసుకుంటున్నారు. 2016లో చిన్న పాండూరు సమీపంలో ఏపీఐఐసీ సెజ్ రావడంతో ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే ఎకరాకు రూ. 6.5లక్షలు పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. అయితే వారికి బీ కేటగిరీలో ఎకరాకు రూ. 3.25లక్షలు మాత్రమే చెల్లించింది. మిగిలిన పరిహారం కోసం గత 9ఏళ్లుగా ఈ ఇద్దరు రైతులు అటు కలెక్టర్, ఆర్‌డీఓతోపాటు మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటికీ పరిహారం మాత్రం అందలేదు. అయితే గత ఏడాది వరకు భూమిని వారే సాగు చేసుకుంటూ ఉండేవారు.

బెదిరించి.. తొలగించి

అయితే రెండు రోజుల క్రితం రైతులు డి. రత్నయ్య, శకుంతలమ్మకు చెందిన భూముల్లోకి ఏపీఐఐసీ సిబ్బంది ప్రవేశించారు. హిటాచీతో పొలంగట్లను పూర్తిగా తొలగించి భూముల రూపురేఖలను మార్చేశారు. సాగు చేసుకునేందుకు వీలు లేకుండా పొలం ఆనవాళ్లను చెరిపేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగారు.

న్యాయం చేయండి



సుమారు 45 ఏళ్ల నుంచి ఈ భూమి మా ఆధీనంలోనే ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గత ఏడాది కూడా సాగు చేశాం. అయితే బుధవారం సాయంత్రం ఏపీఐఐసీ అధికారులు మా పొలం గట్లు తొలగించేశారు. వరినాట్లకు సిద్ధం చేసుకున్న భూమిని నాశనం చేసేశారు. పైగా మాపైనే కేసులు పెడతామని బెదిరించారు. అప్పట్లో ఆ భూమిని రూ.లక్షలు వెచ్చించి సాగుకు సన్నద్ధం చేసుకున్నాం. భూమినే నమ్ముకున్న మమ్మల్ని ఇలా ఇబ్బందిపెట్టడం దారుణం. పూర్తిస్థాయి పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకుంటే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

– రత్నయ్య, బాధిత రైతు, చిన్న పాండూరు

కోడి పందాల స్థావరంపై దాడి

వాకాడు: మండలంలోని కొండాపురంలో ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఎస్‌ఐ నాగబాబు తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు పందెం రాయళ్లతోపాటు మూడు కోడి పుంజులు, వారి వద్ద ఉన్న రూ.1,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు పాఠశాలలకు కొత్త గురువులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1394 మంది నూతన టీచర్లు సోమవారం నుంచి కేటాయించిన బడుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. మొదట్లో ఉద్యోగంలో చేరేటప్పుడు ఉండే ఉత్తేజం రిటైర్ అయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ నూతన అయ్యోర్లకు సూచించారు.

నేత్రదానం


మృతుడి భార్య సుమలతకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) పురుషోత్తం(ఫైల్)

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గాంధీ పార్కు సమీపంలో నివసిస్తున్న కావేరి పాకం పురుషోత్తం(46) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం కన్నుమూశారు. మృతుడి నేత్రాలను ఆయన భార్య సుమలత దానం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వారు నాయుడుపేటకు వచ్చి నేత్రాలను సేకరించుకుని వెళ్లారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుటుంబీకులను పలువురు ప్రశంసించారు.

25న జీశాట్–7ఆర్ ప్రయోగం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈనెల 25వ తేదీన సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఎల్‌వీఎం 3–ఎం5 రాకెట్ ద్వారా జీశాట్–7ఆర్ ఉపగ్రహ ప్రయోగానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 16న ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక పరమైన కారణాలతో వాయిదా పడింది. ఈ రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లాక్–2 బ్లూబర్డ్ అనే వాణిజ్య ఉపగ్రహం సైతం ప్రయోగించాల్సి ఉంది. ఆ ఉపగ్రహం రావడం ఆలస్యం కావడంతోనే జీశాట్–7ఆర్ ప్రయోగం వాయిదాపడినట్లు సమాచారం. 2013 ఆగస్టు 30న ఫ్రెంచ్ గయానా కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి పారిస్‌కు చెందిన అరైన్–5 రాకెట్ ద్వారా జీశాట్–7 ఉపగ్రహాన్ని తొలుత ప్రయోగించారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహం కాలపరిమితి అయిపోవడంతో దాని స్థానంలో జీశాట్–7 ఆర్ పేరుతో రీప్లేస్ చేసే ప్రయత్నంలో భాగంగా ఈ ప్రయోగం చేపడుతున్నారు. షార్ కేంద్రంలోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఎల్‌వీఎం3–ఎం5 రాకెట్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్ : మండలంలోని విన్నమాలలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలు.. రావూరు కృష్ణయ్య (44), సోని దంపతులకు ముగ్గురు పిల్లలు. కృష్ణయ్య కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 8 నెలల క్రితం ఆయన భార్య సోని మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం ఎంత గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో కృష్ణయ్య తన పిల్లలను గ్రామంలోనే నివసించే అక్క పెంచలమ్మ ఇంట్లో వదలిపెట్టాడు. ఈ క్రమంలోనే భార్య తనను వదిలి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆదివారం కృష్ణయ్య ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు తలుపులు తీసి చూడగా మృతదేహంగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృష్ణయ్య ఆత్మహత్యకు పాల్పడి రెండు రోజులై ఉంటుందని ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పోటుకు గ్రైండర్ వితరణ


గ్రైండర్‌ను వితరణగా ఇచ్చిన భక్తుడు

చంద్రగిరి:తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మ వారికి నైవేద్యాలను తయారు చేసే పోటుకు భక్తులు భారీ గ్రైండర్‌ను ఆదివారం విశాఖపట్నంకు భక్తుడు 20లీటర్ల సామర్థ్యం కలిగిన గ్రైండర్‌ను ఆలయ ఏఈఓ దేవరాజులకు అందజేశారు. ఆలయ అధికారులు గ్రైండర్‌కు పూజలు చేసి లడ్డూ పోటు సిబ్బందికి అప్పగించారు.

పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్


ఎన్నికైన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా శశిధర్, ప్రధాన కార్యదర్శిగా చెంచురత్నం యాదవ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా లక్ష్మీపతి యాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రపాణి, త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులుగా మూర్తి, వాణి, లోకేష్, కుమార్, సంయుక్త కార్యదర్శులుగా అలీ, లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

దామినేడులో కార్డెన్ సెర్చ్


స్థానికులతో మాట్లాడుతున్న సీఐ సునీల్ కుమార్

- 20 బైక్‌లు, 13 ఆటోలు, ఓ కారు స్వాధీనం


ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్నవారి వివరాలను సేకరిస్తున్న పోలీసులు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని దామినేడులో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ప్రధానంగా స్థానిక ఇందిరమ్మ ఇళ్లలో ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ సునీల్ కుమార్, నలుగురు ఎస్ఐలు, 9 మంది ట్రైనీ ఎస్ఐలు, సుమారు 60 మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందులో నివసించేవారి గుర్తింపు కార్డులు పరిశీలించారు. అద్దె గదులలో ఉన్న వారి వివరాలను సైతం సేకరించారు.

వరుస చోరీల నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్

ఇటీవల తిరుపతి నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వరుస చోరీలు జరుగుతున్న క్రమంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వేకువజామున 4.30 నుంచి ఉదయం 8 గంటల వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని వెల్లడించారు.. ఈ ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, 13 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే చోరీ కేసులో పరారీలో ఉన్న జోసెఫ్ అనే నిందితుడిని సైతం అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిపారు. కొత్త వ్యక్తులు కదలికలపై అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఇంజినీర్లపై కేసులు దారుణం


మాట్లాడుతున్న ఏపీ పీఆర్‌ఏఈఈ అధ్యక్షుడు సంగీతరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : రాష్ట్రాభివృద్ధి కోసం సైనికుల్లా పనిచేసిన పంచాయతీ ఇంజినీర్లపై కేసులు నమోదు చేయడం దారుణమని ఏపీ పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ (ఏపీ పీఆర్‌ఏఈ) అధ్యక్షుడు కె.సంగీతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో ఏపీ పీఆర్‌ఏఈ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఇంజినీర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అక్రమంగా పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 619 సెక్షన్ ఆఫీసర్ల పోస్టులను ఏపీ పీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు. 3 వేల కోట్లు విలువైన ఉపాధి పనులు పూర్తి చేసినందుకు పంచాయతీ ఇంజినీరింగ్‌శాఖ అడ్మినిస్ట్రేటివ్ చార్జీల కింద మూడుశాతం నగదు విడుదల చేయాలని కోరారు. డివిజనల్ డెవలప్‌మెట్ ఆఫీసర్స్ పోస్టులలో 30 శాతం పీఆర్ ఇంజినీర్లకు కేటాయించాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి పీఆర్ ఇంజినీర్ల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. లేకుంటే డిసెంబర్ నుంచి దశలవారీగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం జేఈలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, పనిభారం తగ్గించేందుకు వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పీఆర్ ఇంజినీర్లు ఉద్యోగ విరమణ పొందుతున్నారే కానీ, ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. దీంతో అర్హులకు అవకాశాలు దక్కక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి బీడీ శ్రీనివాసరావు, జిల్లా జనరల్ సెక్రటరీ డి.చంద్రశేఖర్, చిత్తూరు జిల్లా ప్రెసిడెంట్ మహేష్, జనరల్ సెక్రటరీ అజయ్, యం.శంకరయ్య, టి.లీలాకృష్ణ, యం. లక్ష్మీపతి రెడ్డి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఎస్వీయూలో మందుబాబులు పడ్డారు!


ఓపెన్ ఆడిటోరియంలో మద్యం బాటిళ్లు


క్యాంటిన్ ఎదుట వందల సంఖ్యలో గుట్కా ప్యాకెట్లు

- బారును తలపిస్తున్న వర్సిటీ ప్రాంగణం
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

తిరుపతి సిటీ :ఎస్వీయూ ప్రాంగణంలో నిత్యం మందుబాబులు హల్ చల్ చేస్తున్నారు. గతంలో పలు మార్లు వర్సిటీ అధికారుల దృష్టికి విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు తీసుకెళ్లిన పట్టించుకోలేదు. దీనిపై క్షేత్రస్థాయిలో సాక్షి పర్యటించి సాక్ష్యాధారాలతో ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే వర్సిటీని జల్లెడపట్టి సుమారు రెండు ట్రాక్టర్ల ఖాళీ మద్యం సీసాలు రావడంతో నివ్వెరపోయారు.

పాత కథ పునరావృతం

ఎస్వీయూలో మళ్లీ మందుబాబులు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో ప్రతి చెట్టు కిందా మద్యం తాగే వారే కనిపిస్తున్నారు. మహిళా హాస్టళ్లకు సమీపంలో కూడా మద్యం తాగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అలాగే ఎస్వీయూ ప్రకాశం భవనంలో ఎదుట ఓపెన్ ఆడిటోరియంలోకి సైతం ఇష్టారాజ్యంగా ప్రవేశించి మద్యం సేవిస్తున్నారు. ఆడిటోరియంలో ప్రాంతంలో వందలాది ఖాళీ మద్యం సీసాలు పడిఉండడం గమనార్హం. అన్నపూర్ణ క్యాంటిన్ సమీపంలో కూడా మందు బాబుల హల్ చల్ చేస్తున్నప్పటికీ వర్సిటీ సెక్యూరిటీ, పోలీసులు పట్టించుకోవడం లేదదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు వర్సిటీ ప్రాంగణంలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని కోరుతున్నారు.

ఆదాయముంటే చాలు!

- చిత్ర విచిత్రంగా ఆర్టీసీ వ్యవహారం
- రద్దీ సమయంలో కనిపించని పల్లెవెలుగు సర్వీసులు
- అల్ట్రాడీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లను తిప్పుతున్న అధికారులు
- మహిళలు సైతం టిక్కెట్ చెల్లించి జర్నీ చేయాల్సిన పరిస్థితులు


ఉదయం కాణిపాకం ప్లాట్‌ఫామ్ వద్ద సప్తగిరి ఎక్స్‌ప్రెస్

తిరుపతి అర్బన్: చెప్పేదొకటి చేసేది మరొకటి అన్న చందంగా మారింది ఆర్టీసీ వ్యవహారం. 13 రకాల ఆర్టీసీ సర్వీసులు ఉన్నప్పటికీ స్త్రీశక్తి పథకానికి జిల్లాలో పల్లెవెలుగు సర్వీసులను మాత్రమే వినియోగిస్తున్నారు. అరకొర ఎక్స్‌ప్రెస్‌లను అక్కడక్కడా తిప్పుతున్నారు. అయితే రద్దీగా ఉండే సమయంలో తిరుపతి బస్టాండ్‌లో పల్లెవెలుగు సర్వీసులు లేకుండా అల్ట్రాడీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లను ప్లాట్‌ఫాంలపై పెట్టేస్తున్నారు. పల్లెవెలుగు సర్వీసులు రావడానికి గంటకు పైగా సమయం పడుతోంది. ఇప్పుడు పల్లెవెలుగు సర్వీసులు లేవంటూ మరికొందరు డ్రైవర్లు, కండక్టర్లు చెబుతున్నట్టు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. చేసేది లేక మహిళలు కూడా అల్ట్రాడీలక్స్‌లు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ల్లో టిక్కెట్ కొనుగోలు చేసి జర్నీ చేయాల్సి వస్తోంది.

ఇది మరీ మోసం

తిరుపతి నుంచి కాణిపాకంకు ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు తిరుపతి నుంచి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో సప్తగిరి, అల్ట్రాడీలక్స్‌లు మాత్రమే తిరుపతి బస్టాండ్‌లోని కాణిపాకం ప్లాట్‌ఫాంపై ఉంచుతున్నారు. అలాగే సాయంత్రం 4 నుంచి 7.30 గంటల వరకు ప్రయాణికుల రద్దీ కాణిపాకానికి ఎక్కువ. ఆ సమయంలోనూ అదే పరిస్థితి. మిగిలినప్పుడు గంటకో రెండు గంటలకో ఓ పల్లెవెలుగు సర్వీసు అటొచ్చి ఇటు తళుక్కుమని వెళ్తుంది. మహిళలు సైతం టిక్కెట్లు చెల్లించి సప్తగిరి బస్సుల్లో ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఒక్క కాణిపాకం మార్గంలోనే కాదు.. రద్దీగా ఉండే శ్రీకాళహస్తి, ఇతర మార్గాల్లోనూ అద్దే పరిస్థితి. దూర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తులు ప్రయాణం చేయాల్సిన మార్గాల్లో ఇలాంటి పద్ధతులను అధికంగా ప్రయోగిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



Invite Applications for the following Positions along with the Qualification. 1) Trainer Cum Supervisors-2 Nos, 2) Out Reach Worker and follow up Supervisors-2 Nos. 3) Counsillers / Social Workers/ Psychologist-2 Nos. at Madanapalle. 4) Accounts/ Documentation-2 Nos. at Tirupati. S.N.1-3 Require Masters Degree Sal:15,000 P.M & S.No.4 Graduation along with Exp.in the Field 12,000 P.M. Interested Candidates can submit their Biodata to the WhatsApp No.6303054138.

తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాలలో హోటల్స్ బార్&రెస్టారెంట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్ కావలెను. 9100518607.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph : 9640400073, 9160900024

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు,ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఖచ్చితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తరఫు లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.